
# లేడీ కండక్టర్

## పెద్దూరి వెంకటదాసు



''ఏవండీ!''

'శైలూ! నీ ఫ్రెండ్ సృజన గురించి కాక వేరే విషయమైతే చెప్పు. ఆమె విషయమే అయితే ఇప్పటికే నూటా పదారుసార్లు చెప్పావు. తప్పకుండా ఆమెకు ఏదో ఉద్యోగం చూస్తానన్నానుగా!''

''అదికాదండీ''

''వినే ఓపిక నాకు లేదు. ఇప్పటికే చాలా లేటయింది. రేపుదయమే హోటల్ తాజ్‌కృష్ణాలో ఫారిన్ డెలిగేట్స్‌తో 'లీప్స్ కార్ల కంపెనీ' తుదిచర్చలు మన ప్రభుత్వాధికారులతో, అతికీలకమైన ఆ చర్చలను కవరేజ్ చేయడానికి మా టీంతోపాటు నేను స్వయంగా వెళ్ళాలి. ఏ రాష్ట్రం ఎక్కువ రాయితీలిస్తుందో, ఏ ప్రభుత్వం ఎరవేసి వాళ్ళను లాగడానికి రకరకాల ఆఫర్స్‌తో ప్రలోభపెడుతుందో అక్కడికి జంప్ చేయడానికి చూస్తుంటారు. అయితే నైసర్గికంగా ఒనగూడే సహజ వనరులు దీర్ఘకాలంలో ఏం లాభాలుంటాయో హింట్స్ ఇవ్వడానికి మాలాంటి జర్నలిస్టులం ప్రయత్నిస్తుంటాం మాకున్న రిపోర్ట్స్‌ని బట్టి. సో లెట్ మీ స్లీప్''.

అప్పటికే రాత్రి 12 గంటలయింది. ఆవులిస్తూ నిద్రలోకి జారుకుంటున్న భర్తకు ఇంకేం చెబుతుంది! తనకు నిద్రపట్టడంలేదే!

సృజన గురించే ఆమె ఆలోచనలు, అలా ఎప్పటికోగానీ నిద్రపట్టలేదామెకు.

***

రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో దిగి ఒకసారి చుట్టూ కలయజూసింది.

ఎంత మార్పు. ఎన్నాళ్ళకి తను మళ్ళీ రాజమండ్రిలో అడుగుపెట్టింది. మొట్టమొదటిసారి సృజన పెళ్ళికి – అది జాలీట్రిప్. తన ప్రాణనేస్తం పెళ్ళి – ఎంత సంతోషంగా గడిపింది ఆ మూడు రోజులు. అన్నీ తానై – అందరూ తనే పెళ్ళి పెద్ద అనుకునేలా – ఎంత తృప్తినిచ్చాయా రోజులు. తన మనస్సులో తీపి జ్ఞాపకాలు నింపిన ఆనాటి పర్యటనకు ఇప్పటి తన రాకకు ఎంత వ్యత్యాసం.

విశాఖపట్నం విహార యాత్రకు వెళ్ళిన సృజన కుటుంబం ఉన్నఫళంగా విరుచుకుపడ్డ సునామీలో... ఎవర్నో ఆదుకోవడానికి తెగించి తానే బలైన సృజన భర్త. ఊహించడానికి కూడా వీలులేని ఈ సంఘటన.

తనకిప్పటికి గుర్తు – ఆ కాళరాత్రి...

సునామీ కరాళనృత్యం తను టి.విలో విధ్వంసక దృశ్యాలను కళ్ళప్పగించి చూసిన వైనం, కానీ,

అది తన స్నేహితురాలి కుటుంబాన్నే కబళించిందని అప్పుడామెకు తెలియదు.

సునామీ బాధితుల జాబితాలో తనూ ఒకతెనని, స్నేహితురాలి నుంచి కబురొచ్చేవరకు తెలియదు.

తెలిసిన వెంటనే వైజాగ్‌కు ఫ్లైట్‌లో బయలుదేరింది హుటాహుటిన స్నేహితురాల్ని ఓదార్చడానికి. అప్పుడు చెప్పింది సృజనకి – ''కష్టాలు వచ్చినప్పుడే ఎదురునిలిచి పోరాడే గుండె ధైర్యం చూపాల్సింది. నీకు ఇద్దరు పిల్లలున్నారు.

వాళ్ళకోసం నీవు బ్రతకాలి. తొందరపడి ఏ అఘాయిత్యానికి పాల్పడినా నీ పిల్లలు అనాథలవుతారు. నీవేం అనెడ్యుకేటెడ్‌వి కావు. నీ కాళ్ళమీద నీవు నిలబడగల సమర్థత నీకుంది. ఈ విషయం నేను చెబితే కానీ నీకు తెలియదని కాదు – నీకే అవసరమొచ్చినా నేనున్నానని చెప్పడానికే. ఈ విషయం మరవకు. స్నేహానికి నిర్వచనం నీవే చెప్పావు. నాకా విషయం జీవితాంతం గుర్తుంటుంది. ఏదయినా జరగకూడనిది జరిగితే, సింపుల్‌గా దానర్థం నీవు నా స్నేహాన్ని శంకించినట్టే లెక్క. అది నేను తట్టుకోలేను. ఈ విషయం గుర్తుంచుకుని అడుగెయ్యి. నే వస్తాను'' అంతే – దాని పర్యవసానమే –

తాను కష్టాల్లో ఉన్నానని, తక్షణమే నీవు రావాలని సృజన నుంచి పిలుపు. భర్త చనిపోయినా నిబ్బరంగా బ్రతుకుతుంది అని అనుకుంటున్న దశలో ఏమిటి ఆమెకు అనుకోకుండా కష్టాలు – అదీ ఆయన పోయిన రెండు సంవత్సరాల తరువాత. ఆ సమిష్టి కుటుంబంలో ఏవైనా కలతలుంటే ఆదిలోనే అవి పొడసూపాల్సింది. ఏదిఏమైనా మరికాసేపట్లో తెలిసిపోతుందిగా. అభిజాత్యం గల సృజన తను కష్టాల్లో ఉన్నాననదంటే – మేటరేదో సీరియస్సే. నెమ్మదిగా స్టేషన్ బయటకి నడిచి ఆటో ఎక్కింది. 'కోటగుమ్మం వీధి పోనీ' అని అడ్రసు చీటి మరోసారి చూసుకుంది. సృజన ఇంటి ముందు ఆటో ఆగగానే ఆమె మనస్సులో ఏదో సన్నని అలజడి. తనే స్థిమితంగా లేకపోతే ఆమెనేం అనునయిస్తుంది. గేటు శబ్దం వింటూనే ఎదురువచ్చిన సృజనని చూసి విస్తుపోయింది. అలనాటి సృజనేనా ఈమె అన్నంతగా మారిపోయింది.

ఒక్కమాటలో చెప్పాలంటే – ఐశ్వర్యారాయ్ అందం సృజన ముందు దిగదుడుపే అన్నట్టుగా ఎత్తుకు తగ్గ లావు, పొడగరి – పొట్టి కాని నార్మల్ హైట్. చీర కట్టినా, మోడ్రన్ డ్రస్ వేసినా ఏ గెటప్‌లో ఆమె అందగత్తెనో పందెం వేసుకునే వారం మేమారోజుల్లో. కలుపుగోలుతనం, చలాకీతనం అదనపు ఆకర్షణ తనకి. అలాంటి సృజన మరీ ఇంతలా డీలాపడిపోయిందేమిటి. భర్తలేని లోటు పూడ్చలేనిదే అయినా – రెండు సంవత్సరాల నుంచి తాను బాగానే వున్నానని, తన గురించి బెంగ అవసరం లేదని చెప్తూ వచ్చిందే. తను నిజమేననుకుంది. పెద్ద కుటుంబం. బావగారు, ఇద్దరు మరుదులు, తోడికోడళ్లు, అత్తగారు – అంతా వున్నారుగా అందుకే ఆమె త్వరగా కోలుకుంది అని అనుకుంది తనిన్నాళ్ళు. మరీ ఇలా తయారయిందేమిటి. కాసేపు నోట మాటరాలేదు శైలజకి – సృజనని అలా చూడగానే.

''పద. ట్రైన్ జర్నీ. నైటంతా నిద్రుండదు. ఫస్ట్ నీవు ఫ్రెషప్‌కా. తర్వాత తీరిగ్గా మాట్లాడుకుందాం'' శైలజ చెయ్యి పుచ్చుకుని లోపలికి తీసుకెళ్ళింది సృజన.

''అది సరే – పిల్లలేరి.''

''తీరిగ్గా చెప్తాగా పదమంటుంటే.'' సృజన ఆమెని మరి మాట్లాడనీయలేదు. ఆమె తయారైవచ్చే వరకు టకటక టిఫిన్ రెడీ చేసింది.

ఇద్దరూ కలిసి టిఫిన్ చేస్తుంటే శైలజే అడిగింది తోడికోడళ్ళ పరిచయం తర్వాత –


''ఏదీ! మీ బావగారు, మరుదులు. ఎవ్వరూ కనిపించరేం'' అని .

''అత్తయ్యేమో పిల్లల్ని – అదే శ్రావణిని నీవు వైజాగ్‌లో చూశావుగా, అది ఇప్పుడు సెకండ్‌క్లాస్ చదువుతోంది. బాబు వినీత్ ఫస్ట్‌క్లాస్ – ట్యూషన్ నుంచి తీసుకొస్తుంటుంది అత్తయ్య. కాసేపట్లో వచ్చేస్తారు. ఇక బావగారు, మరుదులు, సరేలే ఆ వివరాలవీ తర్వాత. ముందు నీవు టిఫిన్ పూర్తిచెయ్యి.''

ఆమె మాటల్లో ఏదో అపశృతి ధ్వనించింది శైలజకి.

''మధ్యాహ్నం భోజనాలు వగైరా చేసి రెస్ట్ తీసుకుని ఈవెనింగ్ ఏ పార్క్‌కైనా వెళ్ళి ప్రశాంతంగా మాట్లాడుకుందాం – చెప్తాగా వివరాలన్నీ''.

అంతే, శైలజ ఇక అక్కడ ఆమెను ఏమీ అడగదలచుకోలేదు.




సాయంత్రం వరకు ఎలాగోలా ఓపికపట్టాలి. ఈ మధ్యలో సృజన తోడికోడళ్ళతో మాట్లాడితే పరిస్థితి తనకు కొంతవరకు అవగతమౌతుంది అనుకుంటూ నెమ్మదిగా లేచింది శైలజ. సృజన స్నేహితురాలికి స్నేహితురాలికి ప్రత్యేక వంటకాలేమైనా చేద్దామని వంటింటివైపు నడిచింది.

సాయంత్రం పార్కులో –

సృజన ఒక్కొక్క విషయం చెబుతుంటే నిర్ఘాంతపోయింది శైలజ. చీకటి బ్రతుకుల గురించి, వావివరసలు మరిచి ప్రవర్తించే వారి గురించి వింది, చదివింది – ఛీఛీ అలాంటివారిని చూసే దౌర్భాగ్యపు స్థితి తనకు రావడమా –

కుటుంబ లైంగిక వేధింపుల్లో ప్రత్యక్ష నరకమనుభవించిన సృజన నుంచి కొన్ని దిగ్భ్రాంతికరమైన విషయాలు విని హతాశురాలైంది శైలజ. తన చేతులతో కొసరి కొసరి వడ్డించి పుత్రవాత్సల్యంతో అక్కున చేర్చుకుని ఆలనాపాలనా చూసి పెంచిన మరుదులు కామం నిండిన కళ్ళతో చూపులతో వెంటాడుతూ, జుగుప్సాకరమైన ప్రవర్తనతో బరితెగించి ప్రవర్తిస్తుంటే, పరపతి, పరువు పైటచాటున దాచడానికి పడతికి ఎంత ఓపికుంటుంది. మరుదుల చెంప చెళ్ళుమనిపించింది. విషయం దాచడం మంచిదికాదని తోబుట్టువుల్లాంటి తోడికోడళ్ళకు చెప్పింది. కలిసి ఖండించిన విషయాన్ని కలుషితం చేసి సృజన ఔన్నత్యాన్నే శంకిస్తే – దారేది – అత్తయ్యకు చెప్తే!

అత్తయ్యకు చెప్పినా ఏం లాభం! ఆమెను పట్టించుకోవడం ఏనాడో మానేశారు. ఆమెనేం లెక్కచేస్తారు. విషయం సరాసరి బావకే చెప్పాలి.

బావగారికి నివేదించింది విషయం – మనస్సు రాయి చేసుకుని.

''నీ అందం నాకు నిద్రపట్టనీయడం లేదు. నీవు నాతో ఉంటే అంతా సద్దుమణుగుతుంది. విషయం రోడ్డెక్కితే పోయేది నీ పరువే. ఆలోచించుకో'' అనేసరికి దిమ్మదిరిగిపోయింది సృజనకి.

మొట్టమొదటిసారి తనని సృష్టించిన విధాతను కసితీరా తిట్టుకుంది. తన అందమే శాపమైంది తనపాలిట. ఈ సృష్టి ఉన్నంతవరకు ఎవరికి ఈ స్థితి వద్దు – రక్షించాల్సిన వారే భక్షిస్తామంటే.

ఆయన బ్రతికున్నప్పుడు, సకుటుంబ సమేతంగా 'స్వర్గ్‌సే సుందర్' సినిమాకెళ్ళొచ్చి భోజనాల దగ్గర అందరం మమ్మల్ని చూసే ఆ సినిమా తీశారా అన్నట్టుగా మురిసిపోయాం. ఇప్పుడు ఈ మేకవన్నె పులుల ప్రవర్తన చూసి అక్కడ ఆయన మనస్సు ఎంత క్షోభకు గురౌతుందో! సహనం స్త్రీకి ఆభరణం – నాకు స్ఫురించిందొక్కటే – న్యాయం అర్థిస్తే – నో.

ఎదిరించడానికి నా అవసరం పర్మిట్ చేస్తుందా – నో

ఈ రెండు పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు కావు.

సున్నితంగానే, నేనే దీనికి పరిష్కారాన్ని కనుగొనాలి. పర్యవసానమే నీకు కబురు.

సమస్యకు చావు పరిష్కారం కాదన్నది నిజమయినా, ఆ ఇంట్లో అలా బ్రతకడం పరిష్కారం కాదు. నీవన్నావుగా నీ కాళ్ళమీద నీవు నిలబడమని – అదే – అందుకే నీ సహాయం నాకవసరమైంది. నాకేదైనా ఉద్యోగం – ఏ ఉద్యోగమైనా సరే, నా పిల్లల్ని పోషించుకోవడానికి వీలయినంత త్వరగా నేనిక్కడినుంచి బైటపడాలి. ఈ విషయాలన్నీ నీతో విపులంగా మాట్లాడాలనే, స్వయంగా నీవు పరిస్థితులను చూసి ఆకళింపు చేసుకోవాలనే నిన్ను రమ్మన్నాను. నాకు తెలుసు శైలజ మనసు – నా పిల్లకోసం నన్ను బ్రతకమన్న నీ మాట నన్ను ఎలాంటి అవమానాలనైనా తట్టుకునేలా చేసింది. శైలూ! నీ తోడు లేకపోతే నేనేమైపోయేదాన్నో'' దుఃఖం తన్నుకొస్తుంటే శైలజ గుండెల్లో వాలిపోయి బావురుమంది.

''పిచ్చి సృజనా – ఏది జరిగినా మన మంచికే. విషయం నాకొదిలెయ్''

ఆ మరునాడే హైదరాబాద్ బయలుదేరింది శైలజ, మిత్రురాలి దగ్గర సెలవు తీసుకుని. విషయం భర్త చెవిన వేసింది వచ్చీరాగానే.

ఆ సాయంత్రం భర్త చెప్పిన మాట వింటూనే

ఎగిరి గంతేసినంత పని చేసింది శైలజ.

వెంటనే స్నేహితురాలి పి.పి. నెంబర్‌కి ఫోన్‌చేసి విషయం చెప్పింది. సృజన రాగానే అపాయింట్ మెంట్ ఆర్డర్ చేతిలో పెట్టింది శైలజ.

కండక్టర్ పోస్ట్ – ఆర్టీసిలో. అంటే – తను రేపటి నుంచి 'లేడీ కండక్టర్'.

స్నేహితురాలి కళ్ళలో ఆ మెరుపు, ఉత్సాహం చాలాకాలం తర్వాత ఆ మాటకొస్తే భర్త చనిపోయిం తర్వాత మొదటిసారిగా ఆనందంగా ఫీలయ్యింది ఈరోజే.

మొదట శైలజ కాస్త జంకింది. భర్తను ఉద్యోగం చూడమంటే – కండక్టర్ ఉద్యోగం చూశాడేమిటా అని.

భార్యను కన్విన్స్ చేశాడు. "పిచ్చిదానా. ఎమ్‌టీ మైండ్ ఈజ్ డెవిల్స్ హౌస్. వినలేదా! ఎప్పుడూ బిజీగా వుంచే కండక్టర్ ఉద్యోగమంటే ఒకరకంగా అది గాడ్ గిఫ్ట్. రకరకాల వ్యక్తులతో నిత్యం కలిసే యోగం ఏ ఉద్యోగానికుంటుంది. నామటుకు నాకు ఇలాంటి ఉద్యోగాలే ఇష్టం. అందుకే నేను ఈ జర్నలిజం ప్రొఫెషన్ ఎన్నుకున్నాను. ప్రజలతో మమేకమయ్యే పోస్ట్‌లో ఫ్లెక్సిబులిటీ ఎక్కువ. ఈమెక్కతే కాదుగా ఈ ఉద్యోగంలో చేరింది. ఒక్క హైదరాబాద్ సిటీలోనే ఎనిమిది వందలమంది లేడీ కండక్టర్స్ ఉన్నారట. వారంతా సక్సెస్‌ఫుల్‌గా ఈ ఉద్యోగంలో రాణించడం లేదా!"

భర్త వాదన సబబేననిపించింది శైలజకి.

సృజన ఆనందాన్ని చూసిం తర్వాత ఆమె మనస్సు తేలికపడింది.

కృతజ్ఞత నిండిన కళ్ళతో స్నేహితురాల్ని కౌగిలించుకుని థాంక్స్ చెప్పింది సృజన.

"నాకు కాదే థాంక్స్, మావారికి చెప్పాలి. ఈ ఉద్యోగం సృజనకి ఛాలెంజింగ్‌గా వుంటుందని చెప్పారు."

మనసులో వినోద్‌బాబు గారికి హృదయపూర్వక అభినందనలు అనుకుంటూనే పైకి అనేసింది అప్రయత్నంగా – పేరు ఉచ్చరించినందుకు నాలుక్కరచుకుంటూ.


ఆ రాత్రికి హాయిగా పడుకుంది స్నేహితురాలింట్లో. చాలాకాలం తర్వాత హాయిగా నిద్రపోయింది అనేకన్నా – భర్త చనిపోయిందగ్గరనుంచి ఆమె తృప్తిగా నిద్రపోయింది ఈరోజే.

***

సాయంత్రం 5 గంటలు.

3కె కుషాయిగూడా డిపో బస్సు అఫ్జల్‌గంజ్ అల్లైటింగ్ పాయింట్‌కొచ్చిందో లేదో, బిలబిలమంటూ ఒకర్నొకరు తోసుకుంటూ, దిగేవార్ని సహితం దిగనివ్వకుండా క్షణాల్లో కిక్కిరిసిపోయింది. ఆఫీసులు వదిలిన వేళ– అందరూ ఇంటికి త్వరగా వెళ్ళాలన్న ఆత్రుత – వేసవికాలం కావడం మూలాన బస్సులో ఎక్కిన జనానికి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. స్టాండింగ్ పాసింజర్స్‌తో ఊపిరి కూడా తీసుకోలేనంతగా నిండిపోయింది బస్సు. బస్సు కదులుతుంటే గాలొస్తుంది, స్టార్ట్ చెయ్యవయ్యా బాబూ – ఓ పెద్దమనిషి హితవు. బస్సును బాదడం తారస్థాయికి చేరుతోంది. డ్రైవర్ సులభ్ కాంప్లెక్స్‌కేసే చూడడం మినహా ఏమీ చెప్పలేని పరిస్థితి. చివరకు గోల భరించలేక బండి స్టార్ట్ చేశాడు. కానీ కండక్టర్ – ఆమె టాయ్‌లెట్స్ వైపు వెళ్ళిందని ప్యాసింజర్స్‌కి ఎలా చెప్పగలడు. 'కండక్టర్ లేరు' అని మాత్రం చెప్పాడు తప్పేట్టు లేదని. అంతలోనే 'అదిగోరా సులభ్ కాంప్లెక్స్‌లోంచి వస్తుంది కండక్టర్' అని బస్సంతా వినబడేలా ఓ వెకిలి కామెంట్ చేయడం. ఆ వెంటనే బస్సంతా గోలగోల. రకరకాల విసుర్లు. క్షణం కూడా వేస్ట్ చేయకుండా ఆమె బస్సు ఎక్కగానే మూవ్ చేశాడు డ్రైవర్ వాళ్ళ నోళ్ళు మూయించడానికి.

చాలా దూరం వెళ్ళినతర్వాత టికెట్ ఇష్యూ కోసం – బస్సుని సైడ్‌కు తీసుకుని ఆపాడు..మళ్ళీ అదేగోల. కొందరైతే మరీ బరితెగించి సులభ్ కాంప్లెక్స్‌ను చూసి ఆగిపోయిందేమోరా బస్సు అంటూ కండక్టర్ కేసి వెకిలిగా




చూస్తూ అనడం డ్రైవర్‌కి వినిపించింది. ఒక్కసారిగా అతని రక్తం మరిగిపోయింది. ఛీఛీ ఏం మనుషులు. ఎదుటి వ్యక్తి బాధను అర్థం చేసుకోరేమిటి. తమ ఆడవాళ్ళకోన్యాయం, ఇతరులకు మరోటినా! తమవారి పట్ల ఇలాగే ప్రవర్తిస్తారా! ఆమె వాలకం చూస్తూనే అతనికర్థమైంది. వెంటనే ఒక ప్యాసింజర్‌ని లేపి కండక్టర్‌ను కూర్చోబెట్టి, మంచినీళ్ళ బాటిలందించాడు. కాసిన్ని నీళ్ళు తాగేసరికి కొంచెం తెప్పరిల్లిందామె. తెగించి చెప్పేశాడు, గోల భరించలేక – 'బస్సు వెళ్లదండి – బ్రేక్‌డౌన్' అని.

కండక్టర్‌కి కళ్ళు తిరుగుతున్నాయట. ఒంట్లో బాలేదు – టికెట్ ఇష్యూచేసే స్థితిలో లేదు అని చెబుదామనుకున్నా – నిజం చూసినతర్వాత చేసిన కామెంట్స్ ఎంత వెటకారంగా ఉన్నాయో తెలిసి తనెలా చెప్పగలడు. అయినా, అనేవాళ్ళు అంటూనే వున్నారు రకరకాలుగా. కాసేపట్లో తిట్టుకుంటూనే అయినా అంతా దిగిపోయారు. ఒళ్ళంతా నిస్సత్తువ ఆవరించినా మనసుకి కాస్త ఊరట కలిగింది – సహోద్యోగి పట్ల డ్రైవర్ ప్రవర్తన చూసి. తన నిస్సహాయతని చూసి అర్థం చేసుకున్న కొందరు ప్యాసింజర్స్ సానుభూతి, ఓదార్పు మాటలు విని, ఎలాగోలా డ్యూటీ కంప్లీట్ చేసుకుందామని ప్రయత్నించినా ఒళ్ళు తూలుతుండడంతో ఇక నిలబడలేని పరిస్థితుల్లో ట్రిప్ కాన్సిల్‌చేసి డిపోకి మళ్ళాల్సి వచ్చింది – మొదటిసారి సృజనకి.

***

"వ్వాహ్, వాట్ ఏ సర్‌ప్రైజ్."

"ఏంటి, చెప్పాపెట్టకుండా సడన్‌గా నువ్విక్కడ" ఇంట్లోకి అడుగుపెట్టిన స్నేహితురాల్ని చూస్తూనే సంతోషంతో తబ్బిబ్బయింది సృజన.

"సడన్‌గా నిన్ను చూడాలనిపించి వచ్చేశాను. ఫస్ట్ షిఫ్ట్ చేసి మధ్యాహ్నం మూడు గంటలకు ఇంటికి వస్తావని తెలుసు. అందుకే, నాలుగింటికల్లా నీ దగ్గర వాలాను" చెప్పింది శైలజ.

'ఒక్క నిముషం' అంటూ లోపలికెళ్ళి కాఫీ కలుపుకువచ్చింది సృజన.

ఎ.పి.హెచ్.బి, మౌలాలి, ఇండిపెండెంట్ హవుస్‌లో రెంటుకుంటున్న సృజనకి కుషాయిగూడా డిపో దగ్గరే. డ్యూటీకి వెళ్ళిరావడానికి అనువుగా వుంటుందని రెంట్ కాస్త ఎక్కువే అయినా, శైలజకి కూడా నచ్చింది కాబట్టి అందులో దిగింది సృజన.

"చెప్పు శైలూ ఎలా వున్నావ్."

"నేనడగాల్సిన మాట నువ్వడుగుతున్నావే. అయినా ఈ ఆర్నెల్లలో నీవు చాలా మారావు."

"ఇదంతా నీ చలవేగా."

"సృజనా, ఆ మాట అని నా గుండెని తూట్లు పొడవకు. నాకోసం నీవు చేసిన త్యాగం ముందు నేను చేసిందెంత?"

"ఏమిటి నువ్వనేది. నేను నీకోసం త్యాగం చేశానా?"

"కాదా!"

"ఎవరన్నారలాగని?"

"నాకంతా తెలుసు. మావారు చెప్పారు."

"వాట్! మీవారా!"

"ఏం! ఎందుకంత ఆశ్చర్యపోతావు. ఈ విషయం శైలజకి చెప్పొద్దని నీవు మాట తీసుకున్నావు. కానీ, 'పెళ్ళయ్యేవరకు' అన్న కాలపరిమితిని నీవు మరిచావు. మావారు మరువలేదు. అయినా ఆ తర్వాత కూడా ఆయన చెప్పకపోయేవారేమో కానీ, అనుకోకుండా నీకు వైధవ్యం ప్రాప్తించినప్పుడు, అప్పుడు చెప్పారు.

***

సృజన పెళ్ళిచూపులు –

"శైలూ! శైలూ!! ఏమిటే ప్రతిదానికీ శైలూ! ఆ అమ్మాయి మాత్రం మనిషా, యంత్రమా! ఉదయం నుంచి హడావుడి పడుతునే అన్నీ తనే చూస్తోంది" సుతిమెత్తగా చీవాట్లేసింది సృజన తల్లి.

"నీవుండమ్మా. శైలూ! ఒక్కసారి మేడపైకి వెళ్ళి నా వుడ్‌బీని చూసిరావే. నీవు గ్రీన్ సిగ్నల్ ఇస్తేనేగానీ నేను కుదురుగా ఉండలేను. ప్లీజ్."

"వెళ్తానన్నానుగా. ఆ అవకాశం రానీ" స్నేహితు

రాల్ని ఊరిస్తూ చెప్పింది శైలజ.

ఆ అవకాశం రాగానే క్షణం కూడా వేస్ట్ చేయదల చుకోలేదు శైలజ. ఒంటరిగా గదిలో ఉండడం బోరనిపించి కాస్త వరండాలో పచార్లు చేద్దామని వస్తున్న అతనికి డోర్ దగ్గరే ఎదురుపడింది శైలజ. అతన్ని తాకీతాకనంత దూరంలో – అతనే కాస్త వెనక్కి తప్పుకుని ఆమెకు దారిచ్చాడు.

'సృజనకి తగ్గ వరుడు' అని మొదటి చూపులోనే నిర్ధారణకు వచ్చింది శైలజ.

మొదటి చూపులోనే తనకి నచ్చింది. అందుకే అంటారేమో, లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అతడు నిర్ధారణకు వచ్చాడు. ఆ మాటే అన్నాడు. 'మీరు నాకు నచ్చారని'.

కాసేపు శైలజకేం పాలుపోలేదు – ''మీరు పొరపడుతున్నట్టుంది. పెళ్ళిచూపులు సృజనకి – నేనామె ఫ్రెండ్‌ని. ఆమె కింది గదిలో ఉంది. మీకు ఏదైనా అసౌకర్యంగా ఉందేమో తెలుసుకుందామని వచ్చాను. ఏం కావాలన్నా నాకు చెప్పండి. క్షణాల్లో సమకూరుస్తాను'' వినమ్రంగా చెప్పింది శైలజ.

''నేను మనస్సుతో చూసింది మొట్టమొదట నిన్నే. నీవు నాకు నచ్చావు. ఇంతకంటే నేనేం చెప్పలేను''

''సృజనని చూట్టానికి వచ్చి నేను నచ్చానని చెప్పడం మీకు న్యాయంగా అనిపిస్తుందా?'' శైలజ సూటిగా అడిగింది.

''శైలజ గారూ నేనామెనింత వరకు చూడనులేదు. ఆమెను చేసుకుంటానని చెప్పింది లేదు. ఇందులో అన్యాయమేమీ నాకు కనిపించడం ఏదు. నేను మనసు పెట్టి మొట్టమొదట చూసింది నిన్నే. నా మనస్సు బలంగా నిన్నే కోరింది. ఆ విషయం నీకు చెప్పాను. నీకు నచ్చితే మిగతా విషయాలు నేను మ్యానేజ్ చేసుకుంటాను. మీకు నచ్చకపోతే ఇట్సాల్‌రైట్. నిస్సందేహంగా చెప్పండి'' ఆయన మాటల్లో నిజాయితీ ధ్వనించినా – స్నేహితురాలికి ద్రోహం చేయలేనని – కరాకండిగానే చెప్పింది శైలజ.

''మీరు హర్ట్ కావద్దు. ఆమె నాకన్నా అందంగా ఉంటుంది'' అని చెప్పింది శైలజ వినమ్రంగా.

''మీ సంస్కారానికి నా అభినందనలు. ఇట్సాల్ రైట్. వుయ్ ఆర్ కంఫర్టబుల్ హియర్'' అంతే వినమ్రంగా చెప్పాడతను. గిర్రున వెనుదిరిగింది శైలజ – 'సృజన అందం అతన్ని ఆకట్టుకుంటుంది... నో డౌట్' అనుకుంటూ.

సృజన అబ్బాయెలా ఉన్నాడే అని అడిగితే కళ్ళు మూసుకుని ఓకే చేయమంది. కాసేపట్లో చూస్తావుగా అంది.

ఆ క్షణం రానేవచ్చింది.

అబ్బాయి, అమ్మాయి ఒకర్నొకరు చూసుకున్నారు. ఇంక రిజల్టే తరువాయి. అనూహ్యంగా సృజన అడిగింది – ''మేం కాసేపు ఏకాంతంగా మాట్లాడుకోవటానికి అవకాశమిస్తే, అది మీకభ్యంతరం లేకపోతే''

''ఓకే'' అన్నాడు అబ్బాయి. అందరూ తలలూపారు.

కాసేపు మేడపైకి వెళ్ళి మాట్లాడుకుని వచ్చారిద్దరు.

అంతా నిశ్శబ్దం. గంభీరమైన వాతావరణం. నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఇద్దరూ నోరు విప్పారు. ''మా మనస్సులు కలవలేదు. మేం కలిసి మనలేము. వుయ్ ఆర్ వెరీ సారీ'' ఇద్దరిదీ ఒకేమాట.


ఎవ్వరూ మాట్లాడలేని పరిస్థితి.

సృజన పెళ్ళిచూపుల తతంగం అలా అసంతృప్తిగా ముగిసింది ఆనాడు.

***

ఈనాడు మళ్ళీ జ్ఞప్తికి వచ్చింది వారికానాటి సంఘటన.

''నా మటుకు నాకు నీమీద విపరీతమైన కోపమొచ్చింది. అతన్ని కాదన్నందుకు తిట్టిపోశానుగా నిన్నా రాత్రంతా!



''నన్ను అబ్బాయిని చూడమని పంపి నాతోపాటే ఎలాగైనా అతన్ని చూడాలని నా వెనకాలే నువ్వొచ్చావని, అనుకోకుండా మా మాటలు నువ్వు విన్నావని నాకేం తెలుసు సృజనా. మావారు చెప్పేవరకూ నాకు తెలియదు. నీవు గర్వంతో వినోద్‌ను కాదనుకున్నావనుకున్నాను కానీ, నాకోసం నీవు ఇలా చేశావని నాకేం తెలుసు! సృజనా – నన్ను సుమంగళిగా చేసి నీవు అమంగళిగా మిగిలావు.''

''వద్దు అంతలేసి మాటలొద్దు. నాకోసం నీవు చేసింది తక్కువేం కాదు. నా స్నేహితురాలి పెళ్లి చూపులకొచ్చి నన్నడుగుతున్నారా! నో! అని కరాకండిగా చెప్పలేదా! ఆయనంటే మనసులో ఇష్టమున్నా నాకోసం నీవు దాన్ని చంపుకోలేదా! దాన్నేమంటారో చెప్పు తల్లీ. పోనీలే. గతం తవ్వుకుంటూ వర్తమానం మరచిపోతున్నాం.''

''బైది బై. మొన్నేం జరిగిందో తెలుసా! స్త్రీలు చెప్పుకోలేని శారీరక ఇబ్బందుల్ని కూడా అర్థం చేసుకోకుండా వెకిలి చేష్టలతో, వికారపు మాటలతో వెక్కిరిస్తూ... 'విడోరా' అంటూ ఆపాదమస్తకం నన్ను తినేసేలా చూస్తుంటే – ఎంత కంపరంగా వుంటుందో తెలుసా! అప్పుడప్పుడు చిర్రెత్తుతుంది. అలాంటి జులాయి వెధవల్ని చూస్తుంటే.... రాజమండ్రే కాదు – రాజధానిలోనూ, ఆ ఇంట్లోనే కాదు బయట ఎక్కడైనా ఆడదంటే అలుసే – ఛీఛీ ఒక్కోసారి అసహ్యమేస్తుంది జీవితం మీద.''

''సృజనా అందుకే నేనో నిర్ణయానికొచ్చాను నీ విషయంలో.''

''నా విషయంలోనా''

''అందుకే ఈరోజు నేను నిన్ను కలవడానికి వచ్చింది.''

''ఏ విషయం?''

''నీవు మరోలా అనుకోవుగా''

''చెప్పు! నా దగ్గర దాపరికం దేనికి?''

''నీవు 'విడో' అనే కదా అందరికీ అలుసు''

''సో!''

''నీది చిన్నవయసేగా. చిన్న పిల్లల్ని పెట్టుకుని ఒంటరిగా...''

''అంటే''

''నీకోసం కాకపోయినా, నీ పిల్లల రక్షణ కోసం...''

''శైలూ''

''అవును సృజనా! నీవు మళ్ళీ పెళ్ళి చేసుకో.''

''ఒంటరిగా ఉన్న ఆడదాని మీద లేనిపోని అపనిందలు – అది నీవిప్పుడు భరించగలిగినా రేపు పిల్లలు పెరిగి పెద్దవారయ్యాక – చెయ్యని తప్పుకు సంజాయిషీ ఏమని ఇవ్వగలవు. పనిగట్టుకుని షికార్లు చేసే పుకార్లను తట్టుకుని పిల్లల ముందు ఎలా నిలబడగలవు. కొంతకాలంగా ఈ ఆలోచనలతో నాకు నిద్రపట్టడం లేదు. చెప్పు సృజనా! నా ఆలోచనలో లోపముందంటావా! నేను నిన్ను శంకించడం లేదు. భవిష్యత్తులో కూడా అలా జరగదు. నీ పరంగా నీవు ఓకే. అవతలివారు అలాగే ఉండాలని రూలు లేదుగా''

''శైలూ! నీవలా ఆలోచించడంలో తప్పులేదు.''

''నేనర్థం చేసుకోగలను నీ ఆందోళన''

''రేపు నేను ఎవరినైనా పెళ్ళి చేసుకున్నా, పిల్లల్ని చూస్తాడన్న నమ్మకమేమిటి? ఎవరైనా అలా కమిట్ అయినా ఆఖరి వరకు ఆ మాటమీద నిలబడతాడన్న గ్యారంటీ ఏమిటి?''

''ఒకవేళ అలా నీ పిల్లల్ని తన స్వంత పిల్లల్లా చూసుకునే వాడయితే ఓకేనేనా!''

''జనం గురించి వింటున్నదానివి నువ్వు. జనం మధ్యలో వుంటున్నదాన్ని నేను. అయినా, రామభద్రుణ్ణి కట్టుకున్నావు. అందరికి అలాంటి రాముడే దొరకాలి అంటే సాధ్యమా! అయినా నాకలవాటైపోయిందీ జీవితం.''

''ఆ రాముని లాంటి వారు దొరికితే చేసుకుంటావా!''

''నీకుగానీ పిచ్చిపట్టిందా! దివిటీ పెట్టి వెతికినా దొరకరు. ఈరోజు నా అందాన్ని చూసి చేసుకున్నా, నా పిల్లల్ని చూస్తారన్న నమ్మకం నాకు లేదు. రేపు

పెరిగి పెద్దవారయ్యే పిల్లల గురించి ఈరోజుక్కు తప్పు నిర్ణయం తీసుకుంటే జీవితాంతం అది నన్ను బాధిం చదా? ఆ బాధకంటే ఇదే నయం. నా పెంపకం మీద నాకు నమ్మకముంది. ఆ విశ్వాసమే నా పెట్టుబడి. ష్! ఈ డిస్కషన్‌లో టైమే మర్చిపోయాం. శైలూ త్వరగా వెళ్ళు... మీవారొచ్చే వేళయింది.''

ఏదో నిర్ణయానికొచ్చిన దానిలా తల పంకిస్తూ ఇంటిదారి పట్టింది శైలజ.

***

''సృజనా! ఫోన్'' షిఫ్ట్ దిగి డిపోలో క్యాష్ సరెం డర్ చేసి వెనుతిరుగుతున్న సృజనకి పిలుపు.

వాట్. తనకి ఈ టైంలో డిపోలో ఉంటుందని తెలిసి ఫోన్ చేసిందెవరబ్బా అనుకుంటూ పరుగు లాంటి నడకతో వెళ్ళి ఫోనందుకుంది.

''యస్. సృజనా స్పీకింగ్'' ఆతృత ఆమె కంఠంలో.

''సృజనగారూ బాగున్నారా'' కూల్‌గా ప్రశాం తంగా, ఆత్మీయతను కలగలిపి కుశలమడిగిన ఆ గొంతును తానెలా మరువగలదు.

'గుడీవినింగ్, ఐయామ్ ఫైన్, వినోద్‌బాబు గారూ''

ఎందుకనో అతనితో తెలుగులో ఏం మాట్లాడాలన్నా భయమే. జర్నలిస్టుగా, కాల మిస్టుగా తెలుగులో అతని ప్రతిభాపాట వాలు తెలిసిన సృజనకి ఏం మాట్లాడితే ఏం తప్పు దొర్లుతుందోనని.

''సృజనగారూ మీకు వీలయితే ఈరోజు ఈవెనింగ్ ఒకసారి మా పత్రికాఫీ సుకు రాగలరా'' అభ్యర్థించినట్టుగా కాదు శాసించినట్టు చెప్పే అధికార మున్న ఏకైక వ్యక్తి తన దృష్టిలో అతను. తనెలా కాదనగలదు.

''ఈవెనింగ్ ఎన్ని గంటలకో చెబు తారా!'' సడన్‌గా పిలిచేసరికి టెన్ష న్‌గా ఉంది సృజనకి. అందులో ఆయ నకి టైంసెన్స్. కరెక్ట్ టైం తెలుసుకుని పోతే పోలా!

''నాలుగున్నర తర్వాత ఐ విల్ బీ ఫ్రీ'' చెప్పాడు.

''ఓకే, వస్తానండి'' అంటూ ఫోన్ కట్‌చేసింది ఆయన విలువైన సమయాన్ని దృష్టిలో ఉంచుకుని.

***

సాయంత్రం 4.30 గం.

సరిగ్గా టైంకి చేరుకుంది పత్రికాఫీసుకి సృజన.

ఆల్‌ఆఫ్ సడన్‌గా తననెందుకు పిలిచినట్టో.

ఆ ఘడియ రానే వచ్చింది.


''అమ్మా! సార్ రమ్మంటుండు'' ఆఫీస్ బాయ్ పిలుపు.

''కూర్చోండి'' చూస్తున్న ఫైల్ క్లోజ్ చేసి కుర్చీ చూపించాడు వినోద్‌బాబు. బొమ్మలా కూర్చుండిపో యింది కుర్చీలో. ఆనాడు తను చెప్పిందంతా బుద్ధిగా విని, తు.చ. తప్పకుండా పాటించిన ఆ వినోద్‌బాబు మొదటిసారి ఇలా ఏకాంతంగా తారసపడితే ఆనాటి లాగా తను ఎందుకు చలాకీగా మాట్లాడలేకపో తోంది. మనసులోని ఆరాధనాభావం మాటల్లో చూపలేకపోవడానికి కారణం మొట్టమొదటిసారి సృజనకి అర్థంకాలేదు తన పరిస్థితి. అతనిలో మాత్రం అదే ప్రశాంతత, అదే చెరగని చిరునవ్వు అత డికెలా సాధ్యం.

''సృజనా! మొదటిసారి నిన్ను ఏకవచనంలో సంబోధిస్తున్నాను. గుండెల్లోని ఆత్మీయత నన్ను అలా పలికిస్తోంది. నాదీ నీ పరిస్థితే. నేనో జర్నలిస్టుని. కోటి భావాలను మాటలే కాదు - మౌనమూ తెలుపు తుంది. నీ అంతరంగం నాకు తెలుసు. నీతో పరిచయ మైన తొలిరోజే నీ వ్యక్తిత్వం నాకు అర్థమైంది. శైలు నీకో ఉద్యోగం చూడమని చెప్పింది - నీ కాళ్ళమీద నీవు నిలబడేలా. సృజనా! ఉద్యోగంలో ఉన్న ఎని మిది గంటలు నిలబడేలా కండక్టర్ ఉద్యోగంలో చేర్పించి, నీకు ఎంతవరకు న్యాయం చేశానో గానీ, నాకు మాత్రం సృజన నిలబడగగడమే కాదు, తను పనిచేసే సంస్థను కూడా నిలబెడుతుంది అన్న నమ్మకం నాది.

'సృజనా కెన్ డూ దిస్ జాబ్ సక్సెస్‌ఫుల్లీ' ఆ సంతృప్తి నాకు ఇప్పుడిప్పుడే కలుగుతోంది. ఇంకా నీ కెరీర్‌లో సాధించాల్సింది ఎంతో ఉంది.

సృజనా! శైలుకోసం నీవు నన్ను కాదన్ననాడే నీవేంటో నాకు తెలిసింది. నిస్వార్థంగా, నిర్భయంగా పనిచేసే నీలాంటి వారిని పొందిన సంస్థ గర్వపడాలి. నీలాంటి కార్యద క్షులు ఎక్కడా ఆగిపోకూడదు. అలసత్వం దరిచేరకూ డదు.''




సృజన గుండె వేగంగా కొట్టుకుంటోంది. తనె క్కడ అలసత్వం ప్రదర్శించిందీ - తనవల్ల ఏం పొర పాటు జరిగింది - అదే అడగాలని.

''మీరు''

''సృజనా! అందంగా సృష్టించినందుకు విధాతను దూషించడం ఎంతవరకు సబబు. నీకు జరిగిన నష్టం పూడ్చలేనిదే. చిన్నవయసులో వైధవ్యం- జీవిత మంటే దాంపత్యమే కాదు సృజనా - అందం కూడా అక్కడికే పరిమితం కాదు. ఆ తర్వాత అది అడవికా సిన వెన్నెలైపోదు. పోకూడదు.

''అనాథ బాలుడ్ని అక్కున చేర్చుకోవాలని అను కున్నా - కురూపి, అసహ్యంగా వున్న ఒక స్త్రీని చూపి 'ఆయమ్మ నిన్ను ఒళ్ళో కూర్చోబెట్టుకుంటుందంట పోరా' అంటే పోతాడా - నువ్వు పిలిస్తే వస్తాడా! అంతెందుకు శుభ్రంగా సబ్బుతో చేతులు కడుక్కున్న తర్వాతే తినుబండారాలను తాకండి అనే యాడ్‌లో శుచిశుభ్రత లేని అనాకారులను చూపిస్తే ఎలా ఉంటుంది. పన్నెండేళ్ళ పాపయినా పండు ముసల యినా అద్దం ముందు అమూల్యమైన కాలాన్ని హరిం చేస్తున్నారంటే - నీవామాత్రం అర్థం చేసుకోలేవా సృజనా. నీవైపు అదోలా చూసేవారిని, నీ అందానికి వ్యక్తిత్వాన్ని జోడించి ఆరాధనా భావంతో చూసేలా చేసుకోలేవా! దుష్టులకి దూరంగా ఉండాలంటే అది సాధ్యమా. దృష్టత్వాన్ని దూరం చెయ్యాలిగాని. దాని కేనేమో భగవంతుడు నీకు అందం, వ్యక్తిత్వం అద నంగా, ఆభరణంగా ఒదిగాడు.

బిల్‌గేట్స్‌కి సమస్య వుంది, బిచ్చగాడికీ సమస్య వుంది. దాన్ని పరిష్కరించుకుంటూ పయనించడమే మన పని.

'శ్రీరాముడి లాంటి వ్యక్తి దొరికితే సృజన పెళ్ళి చేసుకుంటుందట' అని శైలు చెప్పింది. 'నువ్వు రామ భద్రుని కట్టుకున్నావు. అలాంటి వ్యక్తి నాకెప్పుడు దొరకాలి' అని నువ్వన్నావని కూడా చెప్పింది.

దాన్ని ఆమె మరోలా అర్థం చేసుకుందేమో! సృజ నకి మనమే న్యాయం చేయా లంది. సుమంగళిని చెయ్య మని నన్ను వేడుకుంది.

శైలూ మనసు నొప్పిం చడం ఇష్టంలేక నిన్ను పిలిపిం చాను. 'శ్రీరాముడు ఏకపత్నీవ్ర తుడు' సృజన మాటలోని అంత రార్థం ఇది అని నేను చెబితే కూడా ఆమె వినే పరిస్థితిలో లేదని...

సృజనా! నీలాంటి వ్యక్తి నాకు ఆత్మీయురాలైనందుకు సంతో షంగా ఉంది.''

సృజన కళ్ళల్లో నీళ్ళు నిండాయి. భగవద్గీత బోధిస్తున్న శ్రీకృష్ణుడే కనిపించాడామెకాయనలో.

రామభద్రుని గురించి చదివింది. ఆ రాముణ్ణే నేడు దర్శిస్తోంది.

అందమైన స్త్రీ తన ఎదుట ఉండి, అర్ధాంగి నుంచి క్లియరెన్స్ వుండి, ఆ అసహాయురాలిని ఆదుకున్న వ్యక్తియై వుండి, ఆర్థికంగా అత్యున్నత స్థితి ఉండి... ఆమె ఆలోచన అలా వుంటే -

తన ప్రాణనేస్తం మనస్ఫూర్తిగా భర్తను ఒప్పించి, ఆమెను సవతిగా తెమ్మని పంపినా, ఆయన మహో న్నత వ్యక్తిత్వమున్న మనిషని, తనకి తన పిల్లలకి ఎలాంటి లోటు వుండదని తెలిసినా సున్నితంగా తిర స్కరించి, తన నిర్ణయాన్ని చెప్పకనే చెప్పిందంటే - అరుంధతి, అనసూయ, సుమతి, సావిత్రిలే కాదు - సృజన ఉంది ఇక్కడ - అనునిత్యం సమస్యలతో సత మతమౌతూ సౌశీల్యంగా జీవన సమరాన్ని సాగించే - సృజనలు ఎందరో ఈనాడు. 'హేట్సాఫ్ టు దట్ కైండ్ ఆఫ్ వుమన్''.

★